ఈపాటికే అమ్మ ఒడి డబ్బు పడేది



నాకు ఇద్దరు పిల్లలు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో డబ్బు ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. కాని అధికారంలోకి వచ్చాక ఇంకా విధి విధానాలంటూ ప్రభుత్వం జాప్యం చేయడం బాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనైతే ఏటా పిల్లల చదువులకు ఉపయోగపడేలా అమ్మ ఒడి డబ్బులు సకాలంలో నా బ్యాంకు ఖాతాలో పడేవి.

- కరుకోటి కుమారి, తల్లి, సూర్యనగర్, అమలాపురం

రూ.20 వేల సాయం ఏమైంది?



మూడు ఎకరాల్లో నేను సొంతంగా సాగు చేస్తున్నాను. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామంటూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నా పంట అవసరాలకు డబ్బులు ఇవ్వడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మే నెలలోనే రైతు భరోసా పేరుతో డబ్బులు పడేవి.

- ఇళ్ల శ్రీరామకృష్ణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

తల్లికి వందనం ఇంకెప్పుడు



తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున డబ్బులు ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ రూ.30 వేలు వస్తుందని నమ్మాను. కాని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇప్పట్లో అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి సకాలంలో ఇవ్వడం వల్ల ఆ డబ్బులు పిల్లల చదువుకు బాగా ఉపయోగపడేవి.

- నందక గంగాభవాని, తల్లి, పల్లంకుర్రు, కాట్రేనికోన మండలం

నిరుద్యోగ భృతి మళ్లీ మోసమేనా?




2014-19 టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి ఇవ్వకుండా మోసం చేశారు. ఈసారి ఎన్నికల్లోనూ సూపర్ సిక్స్ హామీల్లోనూ ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి నేతలు ప్రకటించారు. అసలు ఆ ఊసే ఎత్తకపోవడం చూస్తుంటే మళ్లీ మోసం చేస్తున్నారేమోనన్న సందేహం కలుగుతోంది.

- మట్టపర్తి మణికుమార్, నిరుద్యోగి, ముమ్మిడివరం

సూపర్ సిక్స్.. ఎగవేత ఫిక్స్

- ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు
- హామీలన్నీ ఎప్పటి నుంచి అమలు చేస్తారంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు
- తేల్చి చెప్పకుండా కాలయాపన చేస్తున్న 40 ఇయర్స్ ఇండస్ట్రీ



అమలాపురం టౌన్: నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబుకు ఉన్న ట్రాక్ రికార్డు దేశంలోని ఏ రాజకీయ నేతకు లేదనేది జగమెరిగిన సత్యం. ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం, అధికారంలోకి వచ్చాక హామీలన్నీ తుంగలోకి తొక్కేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. 2014 ఎన్నికల్లో గెలిచాక టీడీపీ మేనిఫెస్టోని ఏకంగా తన పార్టీ వెబ్‌సైట్ నుంచి మాయం చేసేసిన ఘనత ఆయనది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ఇంటింటా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండడం చూసి బాబుకు వణుకు పుట్టింది. దీంతో 2024 ఎన్నికలకు ముందు తాను మారానని గతంలో ఎన్నడూ లేనంత సంక్షేమం అందిస్తానని చిలక పలుకులు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు అనేక రాష్ట్రాల పథకాలను ఎత్తుకొచ్చి పేర్లు మార్చి అమలు శక్యం కాని హామీలన్నీ కలిపి తన మేనిఫెస్టోలో చేర్చారు. తల్లికి వందనం, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతినెలా రూ.1500, రైతులకు ఏటా రూ.20 వేల సహాయం అంటూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టారు. తీరా సీఎంగా పీఠమెక్కాక రాష్ట్రానికి మళ్లీ చంద్ర గ్రహణం పట్టించేశారు. గెలిచిన వెంటనే నమ్మి ఓట్లేసిన ప్రజలను నిలువునా ముంచారు. యూటర్న్ బాబు ఎన్నికల వేళ ఇచ్చిన హామీల విషయంలో మాట తప్పడానికి, మడమ తిప్పడానికి ఈసారి కూడా ఎక్కువ సమయం తీసుకోలేదు. అధికార గద్దెనెక్కి సెంచరీ(100 రోజులు) దాటేసినా తాను ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పటినుంచి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకపోగా శ్వేతపత్రాల పేరుతో ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇప్పటికే నాలుగుసార్లు సీఎంగా బాబోరి యూటర్న్‌లు చూసి చూసి విసిగిపోయిన జనానికి మళ్లీ తాము మోసపోయామేమోనన్న సందేహం మొదలైంది. అందుకే ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆర్భాటంగా ప్రకటించిన ఆరు హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారు? అసలు ఇస్తారో ఇవ్వరో తేల్చి చెప్పాలని కూటమి నేతలను ప్రశ్నిస్తున్నారు.



జగన్ పాలనలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఐదేళ్లలో లబ్ధి
రైతు భరోసా	అమలాపురం	37,500 మంది	రూ.328 కోట్లు
	ముమ్మిడివరం	39,000 మంది	రూ.344 కోట్లు

జగన్ పాలనలో ఐదేళ్లలో తల్లులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి
అమ్మ ఒడి	అమలాపురం	37,085	రూ.127.87 కోట్లు
	ముమ్మిడివరం	25,587	రూ.118.60 కోట్లు


మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

అమలాపురం	- 1.76 లక్షల మంది
ముమ్మిడివరం	- 1.29 లక్షల మంది

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందాల్సిన సాయం



పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఇవ్వాల్సిన మొత్తం(ఏడాదికి)
అన్నదాత సుఖీభవ	అమలాపురం	37,500 మంది	రూ.75 కోట్లు
	ముమ్మిడివరం	39,000 మంది	రూ.78 కోట్లు

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం



పథకం	నియోజకవర్గం	విద్యార్థులు	ఇవ్వాల్సిన మొత్తం(ఏడాదికి)
తల్లికి వందనం	అమలాపురం	38,424	రూ.57.63 కోట్లు
	ముమ్మిడివరం	27,400	రూ.41.10 కోట్లు


ప్రతి మహిళకు నెలకు రూ.1,500



నియోజకవర్గాల వారీగా అందించాల్సిన సాయం

అమలాపురం	- రూ.26.40 కోట్లు
ముమ్మిడివరం	- రూ.19.35 కోట్లు

ప్రతి ఇంటికి గ్యాస్ సిలిండర్లు



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

అమలాపురం	- 64,000 మంది
ముమ్మిడివరం	- 68,000 మంది

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	నిరుద్యోగులు	ప్రతి నెలా ఇవ్వాల్సిన సాయం
అమలాపురం	23,000 మంది	రూ.6.90 కోట్లు
ముమ్మిడివరం	19,000 మంది	రూ.5.70 కోట్లు

ఉచిత సిలిండర్లు ఎప్పుడిస్తారు?



ఏడాదికి ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకూ ఒక్క సిలిండర్ కూడా ఇవ్వలేదు. త్వరలో ఇచ్చేస్తాం అంటూ ప్రకటనలతో కాలం గడిపేస్తున్నారు. గ్యాస్ ధర భరించలేకపోతున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి.

- గిడ్ల అప్పాయమ్మ, బాబానగర్, సుంకరపాలెం పంచాయతీ

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో



టీడీపీ, జనసేన నేతలు ఎన్నికల సందర్భంగా మహిళందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికీ దానిపై స్పష్టత ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే హామీలు అమలుచేస్తామని చెప్పి ఇప్పుడు వాటి ఊసే లేదు. ఉచిత బస్సు ప్రయాణంతో సహా సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలుచేయాలి.

- కె.గనికమ్మ, కొత్తలంక

నెలకు రూ.1500 ఇస్తామని ఊరించారు



ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీల అభ్యర్థులు, నాయకులు ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అందరికీ రూ.1500 చొప్పున ఇస్తామని ఊరించారు. ఇప్పుడేమో అసలు ఆ డబ్బులు ఎప్పుడిస్తారో తెలియని అయోమయ పరిస్థితి ఉంది. ఇప్పుడు ఇంకా అమలు చేయకుండా ఉసూరుమనిపిస్తున్నారు. వెంటనే ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలి.

- నీలం సుజాత, గృహిణి, కాట్రేనికోన

క్లుప్తంగా

డిగ్రీ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

ముమ్మిడివరం: సాంకేతిక విద్యతోనే కాకుండా డిగ్రీ కోర్సులు అభ్యసించడం ద్వారా కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని నన్నయ్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాబులు విద్యార్థులకు సూచించారు. స్థానిక డాక్టర్ రావు బహదూర్ రఘుపతి వెంకట రత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్థి నిర్మిత్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్ షాపునకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో చాయిస్ బ్రోకింగ్ లిమిటెడ్ రీజినల్ అధికారి మహ్మద్ సలీం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, కంప్యూటర్ అధ్యాపకులు పి.ఆనంద్, సీహెచ్ సతీష్, మల్లాడి నరసింహ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హడాక్ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం జిల్లా నూతన హడాక్ కమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పూలమొక్కను అందజేసి నూతన జిల్లా కమిటీ సభ్యులంతా పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో నూతన హడాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వీరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా ప్రసాద్, నిమ్మకాయల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

అమలాపురం టౌన్: రావులచెరువులో సంభవించిన బాణసంచా విస్ఫోటన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎనిమిది మంది క్షతగాత్రులు క్రమేపీ కోలుకుంటున్నారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన గొవ్వాల నాగలక్ష్మి శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో వెంటిలేటర్‌పై వైద్యం అందిస్తున్నారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆమెకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. విస్ఫోటనం జరిగిన ఇంటి శకలాల నుంచి ఫోరెన్సిక్ నిపుణుల బృందం నమూనాలను సేకరించింది. విజయవాడ ల్యాబ్‌లో నమూనాలను పరీక్షించి తుది నివేదికను ఇవ్వనున్నారు.

పారదర్శకంగా రుణ అర్హత కార్డుల జారీ

కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కౌలుదారులకు రుణ అర్హత కార్డులు జీవో నంబర్ 596 ప్రకారం పారదర్శకంగా జారీ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారులతో సమావేశమై కౌలుదారుల రుణ అర్హతకార్డుల జారీ, రుణాల కల్పన, ఆన్‌లైన్ ఉచిత ఇసుక విధానం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సూచనలకు అనుగుణంగా మాత్రమే ఆక్వా చెరువులకు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి ఇసుక తవ్వకాలు, విక్రయాలు నిర్వహించడం లేదన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

సర్వే నివేదికలను సమర్పించాలి

కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ ప్రకారం క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అమలాపురం డివిజన్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ ప్రాథమికంగా నిర్వహించిన తొలి సర్వే నివేదికలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే లైన్ ఏర్పాటుకు అడ్డంకిగా ఏమేం ఉన్నాయో సర్వే నంబర్ల వారీగా సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీఓలు జేవీవీ సత్యనారాయణ, జి.కేశవవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే లైన్‌తో తాగునీటికి విఘాతం

అమలాపురం టౌన్: కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం వల్ల అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు తాగునీటి పథకానికి విఘాతం ఏర్పడుతుందని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి కొందరు ఫిర్యాదు చేశారు. రైల్వే లైన్ నిర్మాణం వల్ల చిందాగరువుతో పాటు అమలాపురం రూరల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ఎస్పీకి నోటీసు జారీ చేసి దీనిపై దర్యాప్తు చేయాలని ఆదేశించింది. హైకోర్టు న్యాయవాది రమేష్ చంద్రవర్మ స్థానిక విలేకర్లకు వివరాలు తెలియజేశారు.

రూ.1,57,000 పలికిన గణపతి లడ్డూ



కూనవరంలో వేలంలో దక్కించుకున్న లడ్డూను భక్తులకు అందిస్తున్న కమిటీ సభ్యులు



సుంకరపాలెంలో వినాయక లడ్డూతో పెద్దిరెడ్డి బాబి తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీకర్షక గణపతి 80వ నవరాత్ర ఉత్సవాల్లో భక్తులు సమకూర్చిన మూడు లడ్డూలను రూ.1,57,000కు భక్తులు వేలంలో దక్కించుకున్నారు. గ్రామానికి చెందిన ఆకుల ఏడుకొండలు, నిమ్మకాయల చిన గంగాచలం 11 కిలోల లడ్డూను రూ.80,000కు, ఆకుల రమేష్ బ్రదర్స్ 5 కిలోల లడ్డూను రూ.36,000కు, బసవా సింహాద్రి బ్రదర్స్ 2 కిలోల లడ్డూలను 41,000కు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని అభినందించి లడ్డూలను అందజేశారు.

ముమ్మిడివరం: మండలంలో కొత్తలంక కాపుల వీధి సెంటర్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించారు. వేలం పాటలో పెద్ద లడ్డూను గ్రామానికి చెందిన పోలిశెట్టి దుర్గా, మెండావాసులు రూ.57 వేలకు, చిన్న లడ్డూను దూడల శివకుమార్ రూ.45 వేలకు దక్కించుకున్నారు. వారిని కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 చెంతన సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయక లడ్డూను టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి బాబి రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. శ్రీలక్ష్మీ గణపతి వర్తక సంఘం అధ్యక్షుడు నామా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు పుట్టినరోజును పురస్కరించుకుని అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. హరి మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు పండ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. స్థానిక లూయి అంధుల పాఠశాలలోని అంధ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులనాని, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బీరు బాటిల్‌తో దాడి

అల్లవరం: మండలంలోని ఓడలరేవు తీరంలో సముద్ర రిసార్ట్స్‌లో కుక్‌గా పనిచేస్తున్న మట్టా ప్రసాద్‌పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు బీరు బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రసాద్ రిసార్ట్స్ వద్ద ఉండగా నలుగురు వ్యక్తులు వచ్చి బీరు బాటిల్‌తో తలపై కొట్టి పరారయ్యారు. తలపై, నుదుటిపై గాయాలు తీవ్రంగా ఉండడంతో ప్రసాద్‌ను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రసాద్‌పై దాడి చేసిన వ్యక్తులెవరో పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రశాంతంగా ముగిసిన బంద్



యానాంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తున్న వివిధ పార్టీల నేతలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్‌చార్జీల పెంపు, విద్యుత్ ప్రైవేటీకరణకు నిరసనగా బుధవారం యానాంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. కాంగ్రెస్, సీపీఎం, వీసీకే తదితర పార్టీల నాయకులు బంద్‌లో పాల్గొని పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, పెట్రోల్ బంకులను స్వచ్ఛందంగా మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును యానాం, మాహే, కారైకల్ ప్రజలు వ్యతిరేకించారన్నారు. బంద్‌లో మల్లాడి సత్తిబాబు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్ధాని దినేష్, వీసీకే పార్టీ నేత మెల్లం శ్రీనివాసరావు, సీపీఎం నేత గుదే దుర్గాప్రసాద్, మోకా బుజ్జి, కుంచే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం విద్యానిధి వార్షిక చందాకు సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ రూ.లక్ష విరాళాన్ని ఇచ్చారు. సదరు మొత్తానికి సంబంధించిన చెక్‌ను సంఘం అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం అందజేశారు.

22 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రాజోలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ రక్తం అత్యవసరమైన రోగులకు స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 22 మంది యువకులు బుధవారం ఆయా ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను ఆయా ఆస్పత్రుల వైద్యులు, యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అభినందించారు. రోగుల కుటుంబీకులు రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

త్రిరత్న బుద్ధవిహార్‌లో మధు పౌర్ణమి వేడుకలు



త్రిరత్న బుద్ధవిహార్‌లో బుద్ధ వందనం చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక త్రిరత్న బుద్ధవిహార్‌లో మధు పౌర్ణమి వేడుకలు బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మధు పౌర్ణమి విశిష్టతను వివరించారు. గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ వందనం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగాబత్తుల శ్రీనివాసరావు, కాశీ రామ్‌బోధి, గోసంగి ఆనందరావు, కాశీ వెంకట్రావు, ములపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.